క్లుప్తంగా

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం



లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

దేవనకొండ: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ పూర్తి చేసుకొని 41వ రోజులు పూర్తవడంతో ప్రత్యేక పూజలు, వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తామని గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఆగస్టు 7, 8, 9వ తేదీల్లో ఆలయంలో స్వామివారి విగ్రహం పునః ప్రతిష్ఠ, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించామని చెప్పారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతి, నైవేద్య సంమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

తప్పిన ప్రమాదం



నెరణికి సమీపంలో బోల్తా పడిన మినీ వ్యాన్

హొళగుంద: మండలంలోని నెరణికి గ్రామ సమీపంలో ఆదివారం మినీ వ్యాన్ బోల్తా పడింది. ఎల్లార్తికి చెందిన వాహనం ఆలూరుకు వెళ్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ దాటిన తరువాత మలుపు వద్ద ఎదురుగా ట్రాక్టర్ రావడంతో అదుపు చేసుకోలేక పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ఈ సమయంలో డ్రైవర్ వెంటనే డోర్ తెరుచుకుని బయటకు వచ్చేశాడు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

రిటైర్డ్ హెల్త్ సూపర్‌వైజర్ మృతి

తుగ్గలి : రిటైర్డ్ హెల్త్‌సూపర్‌వైజర్ పెండేకల్లు రైల్వే జంక్షన్‌కు చెందిన సుంకన్న (82) మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలకు తోడు శనివారం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. సుంకన్న పగిడిరాయి పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సుంకన్న మృతి పట్ల స్థానిక నాయకులు, ప్రజా ప్రతి నిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు



హాలహర్వి కస్తూర్బా పాఠశాల వద్ద మట్టి వేసి రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

హాలహర్వి: స్థానిక ఎస్సీ, బీసీ కాలనీల్లో మట్టిని వేయించి రోడ్డును చదును చేయించామని సర్పంచ్ మల్లికార్జున ఆదివారం తెలిపారు. అలాగే కస్తూర్బా గాంధీ పాఠశాల వద్ద వర్షం వస్తే నడిచేందుకు ఇబ్బందిగా ఉండేదని, అక్కడ కూడా రహదారిని చదును చేయించినట్లు చెప్పారు.

బాధితులకు అండగా ఉందాం

మద్దికెర : చేయి చేయి కలిపి వరద బాధితులకు అండగా నిలుద్దామని ఆపద్బంధుసేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక వ్యాపారుల వద్ద విరాళాలు సేకరించారు. రవి, రామకృష్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.

అన్నదానం

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని హోసూరులో రోడ్డులో ఉన్న వృద్ధాశ్రమంలో ఆదివారం బెంగళూరుకు చెందిన ఆర్జీఏ మార్కెటింగ్ లిమిటెడ్ సంస్థ సభ్యులు జయకృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రంగమ్మ, సంస్థ సభ్యులు రాము, లక్ష్మన్న, రమేష్, మధు, వెంకటరాముడు, పాండు, జావీద్ పాల్గొన్నారు.

వచ్చే నెల 20న రగ్బీ ప్రైజ్ మనీ పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 20 నుంచి 22వ తేదీ వరకు ఖేలో ఇండియా ఆధ్వర్యంలో రగ్బీ ప్రైజ్ మనీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, అండర్ -18 విభాగాల్లో బాలికలకు, ఆపై వయస్సు వారికి మహిళల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. పోటీల వేదిక త్వరలో వెల్లడిస్తామన్నారు.

మంత్రి మాటల్లో నిజంలేదు



రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యప్రకాష్ యాదవ్ మెడికల్ కళాశాలల ఏర్పాటు, అనుమతులపై ఇచ్చిన సమాచారం నిజం కాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలల నిర్మాణానికి నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేలాది కోట్ల రూపాయలు మంజూరు చేశారని, అలాగే అనుమతులు కూడా ఇప్పించారని, వాటిని కొనసాగించుకోవడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమవడంతో ఎంతో మంది పేద విద్యార్థులు సీట్లు కోల్పోయారు. తల్లిదండ్రులు, విద్యార్థుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. - బి.విరుపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే



కళాశాలలపై రాజకీయం తగదు



రాష్ట్రం ఎక్కువ మెడికల్ కాలేజీలుంటే మన విద్యార్థులు అధిక శాతం మందికి తక్కువ మార్కులు వచ్చినప్పటికీ సీట్లు లభించే అవకాశముంటుంది. అలా కాకుండా ప్రభుత్వం పులివెందల, మార్కాపురం, మదనపల్లె మెడికల్ కళాశాలలను రద్దు చేయడం మంచిది కాదు. కేంద్ర ప్రభుత్వం నుంచి పోరాడి మరిన్ని సీట్లు సాధించాల్సిన ప్రభుత్వం ఉన్న వాటిని రద్దు చేయడం ఇదే మొదటిసారి చూస్తున్నా. ఇలా చేయడం వల్ల పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారు. - లక్ష్మీకాంతం,న్యాయవాది, ఆలూరు

- ధ్వంసమైన తొగలగల్లు-యాటకల్లు రోడ్డు
- నరకప్రాయానికి చిరునామాగా హొళగుంద - ధణాపురం రహదారి

అధ్వానంగా రోడ్లు



తొగలుగల్లు-యాటకల్లు రోడ్డులో గుంతల్లో ఇరుక్కు పోయిన వాహనం



గుంతలు పడి అధ్వానంగా మారిన హొళగుంద - ధణాపురం రోడ్డు







గుంతలమయమైన హొళగుంద - ధణాపురం రోడ్డు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు నుంచి తొగలుగల్లుకు వెళ్లే 3 కి.మీ రోడ్డు అధ్వానంగా మారింది. మోకాల్లోతు గుంతలు పడటంతో వాహనదారులు, పొలాలకు ఎద్దులు బండ్లు తీసుకెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొగలుగల్లు నుంచి యాటకల్లు మీదుగా మండల కేంద్రం ఆస్పరికి రావాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రోడ్డు మరింత ధ్వంసమైంది. రైతులు పండించిన కూరగాయలను ఆస్పరి, బిల్లేకల్లు మార్కెట్లుకు ఆటోలు, మినీ టిప్పర్లలో తీసుకెళ్తారు. రోడ్డు బాగలేకపోవడంతో ఆటోలు, మినీ టిప్పర్లు మధ్యలోనే గుంతల్లో ఇరుక్కుపోతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు బాగా లేకపోవడంతో ఆస్పరికి రావాలంటే తురువగల్లు, తంగడరడోణ మీదుగా 30 కి.మీ.తిరిగి వస్తున్నామని వాపోతున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు యాటకల్లు నుంచి తొగలుగల్లుకు వరకు అప్రోచ్ రోడ్డు వేయించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హొళగుంద: ఆదోని మార్గంలోని హొళగుంద - ధణాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలు పడి ప్రయాణికులకు నరకం చూపిస్తుంది. అడుగడుగున మోకాలులోతు గుంతలు పడి నరకానికి రహదారిగా మారింది. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకర పరిస్థితికి చేరుకున్నా సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులకు పూనుకోకపోవడంపై ప్రయాణికులు, వాహనదారులు మండిపడుతున్నారు. ఇక రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయాల పాలవుతున్నారు. ధణాపురం-హొళగుంద ప్రధాన రోడ్డు 26.45 కి.మీ డబుల్ రోడ్డు ఏర్పాటుకు గత ప్రభుత్వం దాదాపు రూ.65 కోట్లు మంజూరు చేసింది. పనులు మొదలైన కొద్ది రోజుల్లోనే వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి పునః ప్రారంభానికి నోచుకోలేదు. ఈ రూట్‌లో బస్సులు నడపడం వల్ల డిపోకు వచ్చిన వెంటనే చాలా పార్టులు మళ్లీ బిగించుకోవాల్సి వస్తుందని ఆర్టీసీ సిబ్బంది పేర్కొంటున్నారు. హెబ్బటం, ఇంగళదహాళ్, ఎం.డీ హళ్లి, వందవాగిలి, లింగంపల్లి, హొళగుందకు విద్య, వైద్యం, వ్యాపారం.. వివిధ పనులు నిమిత్తం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు సరిగా లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ రోడ్డు సంగతి అటుంచి ఉన్న దాన్నైనా మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి: పచ్చి మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆస్పరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పచ్చి మిర్చి సాగు కోసం రైతులు ఎకరాకు రూ. 50వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. పంట దిగుబడి బాగా వచ్చినప్పటికీ మార్కెట్‌లో ధర పూర్తిగా పడిపోవడంతో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారన్నారు. మార్కెట్లో ధర కిలో మూడు రూపాయలు పలుకుతుండడంతో కోత కోసిన కూలీలకు కూలి సొమ్ము ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక అయోమయంలో పడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, మార్కెటింగ్ శాఖ అధికారులు చొరవ చూపి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విరుపాక్షి, అంజినయ్య, రమేష్, సురేష్ పాల్గొన్నారు.



నాటి గురువు శంకరయ్య మాస్టారును సన్మానించిన పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

వెల్దుర్తి: 50 ఏళ్ల వయసులో అందరూ బాలలుగా మారారు. మూడున్నర దశాబ్దాల తరువాత కలుసుకోవడంతో ఆనందోత్సాహాలతో నాటి స్మృతులను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1988-89లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 37 ఏళ్ల తరువాత ఎక్కడెక్కడో స్థిరపడిన స్నేహితులందరూ పట్టణంలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో కలుసుకున్నారు. కరచాలనాలు, కౌగిలింతలతో ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని సహపంక్తి భోజనం చేశారు. ఎన్నో భావోద్వేగాల మధ్య ఆనందంగా గడిపారు. తెలియని ఆనందం, వింత అనుభూతుల మధ్య గడుపుతూ తోటి స్నేహితులందరి కష్టసుఖాలలో పాలుపంచుకుందామని తీర్మానించుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన శంకరయ్య మాస్టారును సన్మానించి ఆశీర్వాదం పొందారు. పూర్వ విద్యార్థులు పామయ్య, హరిసింహనాయుడు, మురళిగౌడ్, హరినాథ్, జయన్న ఆచారి, షెక్షావలి, పరమేశ్, రోజారమణి, శ్రీలక్ష్మి, శోభారాణి కార్యక్రమ ఏర్పాటులో కీలక పాత్ర పోషించగా.. దాదాపు వంద మంది స్నేహితులు పాల్గొని మధురానుభూతులు మిగుల్చుకున్నారు.

ఆదోని వాసికి సర్వేపల్లి నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్.విజయలక్ష్మి

ఆదోని అర్బన్: ఆదోని వాసికి దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణ నేషనల్ అవార్డు దక్కింది. పట్టణానికి చెందిన ఎస్.విజయలక్ష్మి అనంతపురం జిల్లా డి.హీరేహాల్ ఎంజేపీ గురుకుల పాఠశాల బాలికల హైస్కూల్‌లో పీజీటీ హిందీ బోధకురాలిగా పనిచేస్తున్నారు. తిరుపతిలో శనివారం దక్షిణాది నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవంలో అవార్డును మాజీ రాష్ట్రపతి, స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు డాక్టర్ సుబ్రహ్మణ్యశర్మ, ద్రావిడ యూనివర్సిటీ మాజీ వీసీ రత్నయ్య, ట్రస్టు చైర్మన్ కరీముల్లా చేతులమీదుగా అందుకున్నారు. అవార్డు అందుకున్న ఎస్.విజయలక్ష్మిని ఆదివారం ఆదోనిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆదోని యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రాజ్‌కుమార్, ఆదోని మాజీ ప్రిన్సిపాల్ కరాడే విజయ్‌కుమార్, మాధవిబాయ దంపతులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

రోటరీ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి పోటీలు



జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఆదోని అర్బన్: స్థానిక మల్లికార్జున విద్యాలయ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఆదోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇండోర్ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో జోనల్ స్థాయిలోని 50 పాఠశాలల నుంచి వెయ్యి మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరిచారని రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్‌రెడ్డి, డాక్టర్ సైపుల్లా, రోటరీ క్లబ్ యూత్ యాక్టివిటీస్ ఇన్‌చార్జి సాబీర్‌అహ్మద్ తెలిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మల్లికార్జున విద్యాలయ కరస్పాండెంట్ సుగూరప్ప, అడ్వైజరీ మెంబర్ విశ్వనాథ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. చెస్, డ్రాయింగ్, రూబిక్ క్యూబ్, క్విజ్, ఎలిక్యులేషన్ పోటీలను నిర్వహించగా.. డ్రాయింగ్‌లో కిడ్డీస్ రూట్స్ పాఠశాల 7వ తరగతి విద్యార్థిని అనన్య మొదటిస్థానాన్ని, రెండవ, మూడవ స్థానాలను అక్షరశ్రీ పాఠశాల విద్యార్థి విష్ణుసాయి సాధించారు. అదేవిధంగా క్విజ్, చెస్, ఎలిక్యూషన్, రూబిక్ క్యూబ్స్‌లలో ప్రతిభను కనబరిచిన ఆయా పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు రోటరీ క్లబ్ వారు ప్రశంసా పత్రంతోపాటు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, సునీల్‌రెడ్డి, భరత్‌షా, విట్టా మురళీధర్, రాయచోటి సుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, బసవరాజు, ఉమేష్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

- బస్సు సర్వీసులపై 'సాక్షి'లో వరుస కథనాలు
- స్పందించిన ఆర్టీసీ అధికారులు
- తిమ్మాపురం, సంగాలకు విద్యార్థి బస్సు
- బంటణహాలు,కాజీపురం,గుమ్మనూరు, కొట్టాలకు అందుబాటులోకి బస్సులు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ప్రజలు

పల్లెకు బస్సులు



నేమకల్లు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సు

చిప్పగిరి: మండలంలోని 16 గ్రామాల్లోని చిప్పగిరి, ఆలూరు ప్రధాన రహధారిలోని బెల్డోణ, నగరడోణ గ్రామాలకు మాత్రమే బస్సు సర్వీసులు ఉన్నాయి. అదే రూట్‌లో ఉన్న కుందనగుర్తి, నేమకల్లు, రామదుర్గం గ్రామాలకు క్రాస్ రోడ్డులో దిగి గ్రామంలోని నడిచి వెళ్లాల్సి వచ్చేది. అలాగే..ఏరూరు,డేగులహాలుకు అరకొరగా బస్సులు నడుసున్నాయి. దీంతో అయా గ్రామాల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రయాణ సమస్యలపై సాక్షి దినపత్రికలో ఇటీవల 'బడి బహు దూరం', 'ప్రగతి చక్రాలు ఎరుగని పల్లెలు' లాంటి వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. దీంతో గుంతకల్లు నుంచి చిప్పగిరి, బంటణహాలు,గుమ్మనూరు,కొట్టాల,పెంచలపాడు గ్రామాల మీదుగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయడంతో పాటు నేమకల్లు ఉన్నత పాఠశాలలో చదువుతున్న తిమ్మాపురం,సంగాల విద్యార్థులకు విద్యార్థి బస్సును అందుబాటులోకి తెచ్చారు. కాగా..ఇంకా నంచర్ల,దౌల్తాపురం గ్రామాలకు బస్సు సర్వీసులు అందుబాటులోకి రావాల్సి ఉంది.

"సురక్షితంగా గ్రామానికి చేరుతున్నాం



గ్రామానికి నుంచి నేమకల్లు వెళ్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. ఆ గ్రామం దూరంగా ఉండటంతో పాఠశాలకు వెళ్లి రావడానికి బస్సు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇక వర్షా కాలం కావడంతో వర్షం వస్తే రాకపోకలు మానుకోవాల్సిందే. పదో తరగతి కావడంతో మాలో ఆందోళన మొదలైంది. ఇప్పుడు బస్సు ఏర్పాటు చేయడంతో సురక్షితంగా గ్రామానికి చేరుతున్నాం. సుమారు 30 మంది వరకు విద్యార్థులం బస్సులో వస్తున్నాం - సంతోష్..10వ తరగతి, తిమ్మాపురం

"గ్రామస్తులకు ఉపయోగకరం



మా గ్రామం నుంచి గుంతకల్లుకు పోవాలంటే అనేక ఇబ్బందులు పడేవాళ్లం. పట్టణం దూరంలో ఉండటంతో విత్తనాలు, ఎరువులు కొనడానికి రైతులకు అగచాట్లు తప్పేవి కాదు. ఇప్పుడు బస్సు సర్వీసులు అందుబాటులోకి రావడంతో గ్రామంలోని అన్ని వర్గాలకు చాలా ఉపయోగంగా ఉంది. - సురేష్, బంటణహాలు

రేపు ట్రైసైకిళ్ల పంపిణీ

మద్దికెర : మండలంలోని దివ్యాంగులకు మంజూరైన ట్రైసైకిళ్లను మంగళవారం పంపిణీ చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత ఆదివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే కేయి శ్యాంబాబు ఆధ్వర్యంలో వాటిని అందజేస్తామని లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

చిప్పగిరిలో..

చిప్పగిరి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం దివ్యాంగులైన లబ్దిదారులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏడీఐపీ పథకంలో భాగంగా అర్హులైన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి వంట నిర్వాహకులకు శిక్షణ

కృష్ణగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రుచికరమైన వంటల తయారీపై ఈనెల 17,18 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ-2 మద్దయ్య ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, కంబాలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శిక్షణ ఉంటుందని, వంట ఏజెన్సీ నిర్వాహకులందరూ హాజరవ్వాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శేఖర్ కోరారు. ఆదివారం ఎంఈఓ ఆంజనేయులుకు ఎస్టీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగరాజు, బసవరాజు, ప్రసన్నరాజు, అడివన్న, తిమ్మరాజు, ఎల్లప్ప పాల్గొన్నారు.

మారెమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాలను ప్రారంభించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో వెలసిన మారెమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు గ్రామ శివారులోని ముఖద్వారానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి కాయ, కర్పూరంతో వచ్చిన గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామం బంధుగణంతో కళకళలాడుతోంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాత్రి జిల్లా స్థాయి భజన పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజిస్తామని వారు చెప్పారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తామని, విజేతల యజమానులకు వరుసగా రూ.15వేలు,రూ.12వేలు, రూ.10వేలు అందజేస్తామని వివరించారు.

మార్కెట్‌యార్డ్‌లో సౌకర్యాలు కల్పించండి



పట్టణంలోని మార్కెట్ యార్డ్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రైతుల కోసం కనీస సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మార్కెట్ యార్డ్ అధికారులు లక్ష్మి, ఎర్రిస్వామిలకు వినతి పత్రం అందజేశారు. యార్డ్‌లో రైతుల కోసం ఉచిత భోజనం, క్యాంటిన్ సౌకర్యాన్ని, విశ్రాంతి భవనం, మంచినీటి వసతి, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. మార్కెట్‌లో పత్తి కొనుగోలును ప్రారంభించాలని, దళారుల దోపిడీ లేకుండా నివారించాలని, పాత షెడ్లను పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం గ్యారతారీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజుతో పాటు సోమవారం మిలాదున్‌నబీ కలిసి రావడంతో గ్యారతారీఖ్ వేడుకలకు భక్తులు అధికంగా వచ్చారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. మిలాదున్‌నబీ వేడుకల సందర్భంగా దర్గాను, దర్గాలోని మజీద్‌ను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వచ్చిన భక్తులందరికీ ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.